క్లుప్తంగా

అడపా మృతి పత్రికా రంగానికి తీరని లోటు

బోట్‌క్లబ్: సీనియర్ జర్నలిస్ట్ అడపా అప్పారావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పత్రికల్లోను, ఎలక్ట్రానిక్ మీడియాలోను నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన ఎనలేని సేవలందించారని కొనియాడారు. సామాజిక సమస్యలు, రాజకీయ అంశాలు, ప్రభుత్వంలో జరిగే లోటుపాట్లను, ప్రభుత్వ శాఖల్లో జరిగే అవినీతిపై ఆయన అందించిన కథనాలు ఆయా వర్గాలను ఆలోచింపజేసేలా ఉండేవన్నారు. పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసిన అడపా అప్పారావు వంటి వ్యక్తులు అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయనతో తనకెంతో మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జూదరుల అరెస్ట్



గురజనాపల్లిలో నిందితులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై సునీత

కరప: పేకాట శిబిరంపై దాడి చేసి పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్టు కరప ఎస్సై టి.సునీత తెలిపారు. వారి నుంచి రూ.14,570 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గురజనాపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో ఆదివారం తన సిబ్బందితో కలిసి ఎస్సై సునీత దాడి చేశారు. జూదరులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులను సోమవారం కాకినాడ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

దాడిలో ఇద్దరికి గాయాలు

కరప: ఎందుకు గొడవ పడ్డారని అడిగేందుకు వెళ్లిన ఇద్దరు సోదరులపై వంట చేసే కురుపీతో దాడి చేసి గాయపర్చిన ఉదంతమిది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సునీత తెలిపారు. ఆమె వివరాలు మేరకు, కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన గురి మోహన్‌కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం రాత్రి స్నేహితులతో కలిసి కరప మండలం గురజనాపల్లిలోని కోళ్ల ఫారం వద్ద పార్టీ చేసుకున్నారు. పార్టీలో ఉండగా మోహన్‌కుమార్ తనకు వరుసకు సోదరుడైన యానలపు రోహిత్‌ను బిర్యానీ తీసుకురమ్మని తూరంగి పంపాడు. అతడు బిర్యానీ తెస్తుండగా.. నడకుదురు ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి కొందరు రోడ్డుకు అడ్డుగా ఉండి రోహిత్‌తో గొడవపడ్డారు. విషయం తెలుసుకుని మోహన్‌కుమార్ అక్కడకు వెళ్లాడు. రోహిత్‌తో గొడవపడిన నాగేంద్ర ఇంటికెళ్లి అడుగుతుండగా.. అతడు వంట చేసే కురుపీతో సోదరులిద్దరినీ కొట్టాడు. ఈ దాడిలో మోహన్‌కుమార్, రోహిత్‌కు తల, చేతులపై గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు మోహన్‌కుమార్ ఆదివారం కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి



పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

తాళ్లరేవు: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ హెచ్చరించారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కాకినాడ–యానాం జాతీయ రహదారిలో పి.మల్లవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ద్విచక్ర వాహనదారులకు ఈ–చలానా ద్వారా జరిమానాలు విధించారు. వాహనదారులకు తప్పనిసరిగా ఆయా వాహనాలకు సంబంధించి పూర్తి రికార్డు ఉండాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కాకినాడ సినిమాలు



ఆనంద్ సినిమాస్:	ఇడ్లీకొట్టు, కాంతారా, ఓజీ, కిష్కింధపురి
దేవీ మల్టీప్లెక్స్:	ఇడ్లీకొట్టు, కాంతారా, ఓజీ
లక్ష్మి:	కాంతారా
సత్యగౌరి:	ఓజీ
తిరుమల:	ఇడ్లీకొట్టు
సీఅండ్‌సీ:	మిరాయి
సీఅండ్‌సీ–2:	ఓజీ
శ్రీప్రియ:	కాంతారా
పద్మప్రియ:	ఓజీ

వెలుగు లేని తారలు

- అలంకారప్రాయంగా వీధి దీపాలు
- అంధకారంతో నగర ప్రజలు సతమతం
- చీకటిపడితే అసాంఘిక శక్తులతో భయం
- పట్టించుకోని కార్పొరేషన్ యంత్రాంగం



దంటువారి వీధిలో వెలగని వీధి లైటు

బోట్‌క్లబ్: స్మార్ట్ సిటీ స్థాయికి కాకినాడ నగరం ఎదిగినప్పటికీ.. ఇంకా అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ విద్యుద్దీపాలు సక్రమంగా వెలగని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో హైమాస్ట్ లైటింగ్ ధగధగాలాడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో స్తంభాలకు లైట్లు ఉన్నా అవి వెలగకపోవడంతో అంధకారం అలుముకుంటోంది. చీకటిపడితే కొన్ని ప్రాంతాల్లో వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. చిమ్మ చీకట్లో బయటకు అడుగెడితే ఏం జరుగుతుందోనని మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తమ ప్రాంతంలో విద్యుద్దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేస్తే కానీ అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీధి దీపాల నిర్వహణ మరింత అధ్వానంగా తయారైందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం నగరంలో 36 మద్యం షాపులు ఉన్నాయని, వాటికి పర్మిట్ రూములూ మంజూరు చేయడంతో, చీకటి పడితే ఆయా మద్యం షాపుల వద్ద గుంపులుగా చేరి మందుబాబులు రోడ్డుపై వెళ్లే వారిని అటకాయిస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లాలంటే మహిళలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పూటుగా మద్యం సేవించి మందుబాబులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంటోందని చెబుతున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం కలిగిన కాకినాడ కార్పొరేషన్ ప్రస్తుతం వీధి దీపాల నిర్వహణ కూడా సక్రమంగా చేయలేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్‌కు పాలకవర్గం లేకపోవడంతో.. అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పాలకవర్గం లేకపోవడంతో..

వీధి దీపాలకు మరమ్మతులు చేయకపోవడంతో గతంలో కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు సభ్యులు అధికారులను నిలదీసిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం కౌన్సిల్ పదవీకాలం ముగిసి ఏళ్లు గడుస్తున్నా.. ఎన్నికలు లేకపోవడంతో సమస్యలపై అధికారులు ప్రశ్నించే వారు లేక పోయారు. కనీసం పాడైన విద్యుత్ బల్బులు కూడా మార్చకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. స్థానిక టూ టౌన్ ఓవర్ బ్రిడ్జి దిగువ నుంచి టౌన్ రైల్వే స్టేషన్ జవహర్ వీధి మీదుగా మెయిన్ రోడ్డును అనుకుని ఉన్న సూర్యారావుపేట, సాలిపేట ప్రాంతాల్లో గంజాంవారి వీధి శివారు వరకున్న వీధి దీపాల్లో 57 స్తంభాలకు లైట్లు వెలగడం లేదు. స్థానిక బాలాజీచెరువు సెంటర్ హైమాస్ట్ లైటింగ్‌లో రెండు లైట్లు వెలగడం లేదు. బ్రిడ్జిపై లైట్లు వెలగకపోవడం వల్ల.. బ్రిడ్జి దిగువ రెండు వైపులా ఉన్న మార్గాల్లో అంధకారం నెలకొంది. స్థానిక పైడావారివీధిలోనూ వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతంలో ప్రయాణికులు నిత్యం భయంభయంగా ప్రయాణిస్తున్నారు.



పైడావారి వీధిలో అలంకారప్రాయంగా ఉన్న వీధి లైటు

చీకటి పడ్డాక మహిళలు బస్సులు, ఆటోలు దిగి తమ ఇంటికి వెళ్లాలంటే భీతిల్లాల్సిన పరిస్థితి ఉందంటే.. ఇక్కడ అంధకారం ఎలా ఉందో అవగతమవుతోంది.

ఎల్‌బీ నగర్ రోడ్డులో..

నగరంలోని ఎల్‌బీనగర్ రోడ్డులో అనేక విద్యుద్దీపాలు వెలగడం లేదు. ఇక్కడ ఇటీవల కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో పాటు, పర్మిట్ రూమ్‌లూ మంజూరు చేశారు. దీంతో ఇక్కడ మందుబాబుల వీరవిహారానికి అంతులేకుండా పోయింది. కొండయ్యపాలెం బ్రిడ్జిపై ప్రయాణికుల రాకపోకలతో ఎప్పుడూ బిజీగా ఉంటుంది. ఇక్కడ అనేక వీధి దీపాలు వెలగకపోవడంతో, మద్యం షాపు కారణంగా ఈ మార్గంలో ప్రయాణించాలంటే మహిళలు భయపడుతున్నారు. తోడుంటే మినహా రోడ్డుపై రావాలంటే భయమేస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గలాటా సృష్టించే మందుబాబులను అదుపు చేయాలని వారు కోరుతున్నారు.

చీకటిపడితే భయమే..



తరచూ వీధి లైట్లు వెలగని కారణంగా చీకటిపడితే కొన్ని ప్రాంతాల్లోని వీధుల్లో నడిచి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. వీధి దీపాలు నెలలు తరబడి వెలగకపోయినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– సిరెడ్డి రమ్య, స్థానికురాలు

చాలా ఇబ్బందిగా ఉంది



మద్యం షాపులున్న ప్రాంతాల్లోనూ విద్యుద్దీపాలు వెలగని కారణంగా ఆయా రహదారుల్లో ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. దీపాలు వెలగకపోవడంతో మందుబాబులు గుంపులుగా రోడ్డు చివర గలాటా సృష్టిస్తున్నారు.

– ఏలూరి రాణి, స్థానికురాలు

కంకణాల పంపిణీ



భక్తులకు కంకణాలు పంపిణీ చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: శ్రీపీఠంలో ఆదివారం పరిపూర్ణానంద స్వామిజీ చేతుల మీదుగా ఐశ్వర్య కంకణాలు పంపిణీ చేశారు. వేలాదిగా వచ్చిన భక్తులు క్యూలో నిలబడి ఐశ్వర్యాంబిక గుడి వద్ద కంకణాలు స్వీకరించారు. భక్తులందరికీ శుభం జరగాలని, అమ్మ ఆశీస్సులు ఉండాలని ఆశీర్వాదాలు అందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కాకినాడ రూరల్: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గాయత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గాయత్రి, అధ్యాపకుడు పాల్‌రాజు, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, నాగమణి, వర్ధనమ్మను నిర్వాహకులు సన్మానించారు.

బాలికను గుర్తించిన పోలీసులు

గండేపల్లి: అదృశ్యమైన బాలికను గుర్తించి ఆమెను తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని సూరంపాలేనికి చెందిన 19 ఏళ్ల బాలిక సెప్టెంబర్ 30న అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రత్యేక టీమ్‌గా ఏర్పడిన గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు సిబ్బందితో కలిసి గాలించారు. నెల్లూరు జిల్లాలో ఆ బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ తెలిపారు.

పిఠాపురం రాజా ఆశయాలు కొనసాగించాలి



పిఠాపురం రాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బాలాజీచెరువు: విద్యా దాత పిఠాపురం రాజా 140వ జయంతి సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందించాలని సదుద్దేశంతో పిఠాపురం రాజా తన ఆస్తిపాస్తులను విద్యా సంస్థలకు కేటాయించడం అభినందనీయమన్నారు. పిఠాపురం రాజా స్కూల్, కళాశాలల్లో సుమారు ఏడు వేల మంది విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. పాలకులు, యాజమాన్యాలు పిఠాపురం రాజా ఆశయాలు కొనసాగించాలని కోరారు. పీఆర్ విద్యాసంస్థలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్ష, కార్యదర్శులు వాసు, సాయి, నాయకులు సత్యం, అమల, తేజ, బేబీ, లోవరాజు, నాని, మణికంఠ, ఆదర్శ్, కరుణ్, గమినివేల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



బీచ్ రోడ్డులో శిల్పారామం వద్ద కళాకారుల నృత్య ప్రదర్శన

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్ రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు తమ నృత్యాలతో అలరించారు. జగ్గంపేటకు చెందిన ముళ్లపూడి వెంకటలక్ష్మి, సీతారత్న లలిత కళా నృత్య నికేతన్ బృందం సభ్యులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కాకినాడ సిటీ, రూరల్‌తో పాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు నృత్యప్రదర్శనలు వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం ఏఓ మోహన్‌తేజ మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు.



ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?



మధురానగర్‌లో గోతిలో పడిన కారు



మధురానగర్‌లో ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి

బోట్‌క్లబ్: నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారు లేరంటూ వాహన యజమానులు వాపోతున్నారు. స్థానిక మధురానగర్ బొగ్గవరపు సత్రం వద్ద భారీ గోతులు పడడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రమాదాల బారిన పడుతున్నాయి. నెల రోజుల క్రితం ఇక్కడ గోతులు పడినా.. కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో ఈ గోతుల్లో పడి సుమారు పది కార్లు, 30 ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురి కావడమే కాకుండా, వాహనదారులకు గాయాలై ఆస్పత్రి పాలయ్యారు. ఎక్కడా గోతులు లేకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెబుతున్న కూటమి నేతలు తమకు సమాధానం చెప్పాలని వాహన యజమానులు మండిపడుతున్నారు. చిన్న గోతులు పూడ్చలేని దుస్థితిలో కార్పొరేషన్ యంత్రాంగం ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

వైభవంగా అమ్మవారి నిమజ్జనోత్సవం

బోట్‌క్లబ్: శరన్నవరాత్రులు ముగియడంతో ఆదివారం నగరంలో పలు ప్రాంతాల్లో అమ్మవారి పందిళ్లలో ఏర్పాటు చేసిన ప్రతిమలను నిమజ్జనాలకు తరలించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, రంగులు చల్లుతూ.. అమ్మవారికి జేజేలు పలుకుతూ ఊరేగింపు వేడుకలు జరిగాయి. నగరంలోని వార్ఫు రోడ్డుతో పాటు, కాకినాడ బీచ్‌లో అమ్మవారి ప్రతిమలను నిమజ్జనాలు చేశారు. గురువారంతో శరన్నవరాత్ర ఉత్సవాలు ముగిసినా, శుక్రవారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనాలకు తరలించ లేదు. ఆదివారం నగరంలోని గాంధీనగర్, దుర్గానగర్, సాంబమూర్తినగర్, డెయిరీ ఫారం సెంటర్, మధురానగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంతో పాటు, వార్ఫు రోడ్డు, కాకినాడ సాగరతీరానికి తరలించి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

శరన్నవరాత్ర వేడుకలు ముగిసిన నేపథ్యంలో అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుతూ ఆదివారం భానుగుడి సెంటర్‌లోని ఉషా రాజరాజేశ్వరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు శివప్రసాదశర్మ ఆధ్వర్యంలో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా, భక్తులు హోమ క్రతువులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని, అరిష్టాలు తొలగించాలని కోరుతూ ఏటా దసరా ముగిసిన తరువాత హోమం చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, కమిటీ సభ్యులతో పాటు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భానులింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు



నిమజ్జనోత్సవానికి అమ్మవారిని ట్రాక్టర్‌పై తరలిస్తున్న భక్తులు



కరపలో కోలాహలంగా దుర్గాదేవి గ్రామోత్సవం

దుర్గాదేవికి గ్రామోత్సవం

కరప: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం దుర్గాదేవికి గ్రామోత్సవం నిర్వహించి, పెనుగుదురు కేఎంజే కెనాల్‌లో అమ్మవారిని నిమజ్జనం చేశారు. స్థానిక చింతపల్లి రోడ్డులోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు, విజయదుర్గా ఆటో యూనియన్, ఆలయ కమిటీ వారు శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా అమ్మవారిని, దుర్గాదేవి, వినాయకుడు, శివపార్వతులు తదితర వేషధారణలతో, తీన్మార్ వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం జరిపారు. అనంతరం గోదావరి పాయ ప్రవహించే కేఎంజే కెనాల్‌లో అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీవారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దుర్గాదేవి గ్రామోత్సవంలో అమ్మవారి వేషధారణ

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా తయారు చేసేవారికి కచ్చితంగా లైసెన్స్ ఉండాలన్నారు. జనావాసాల మధ్య, రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు ఉంచరాదన్నారు. నివాస గృహాల్లో ఎక్కడైనా బాణసంచాను అక్రమంగా నిల్వ చేసినా, తయారు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, తహసీల్దార్, పోలీసులు, పొల్యూషన్ శాఖలకు సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలన్నారు. దుకాణాల ఏర్పాటుకు వీఆర్వో, పోలీసులు పరిశీలన చేసిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతులు మంజూరు చేస్తారన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం(సామర్లకోట): ప్రసిద్ధిచెందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికైన రోజు కావడంతో ఆలయ ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశ మందిరంలో ఆలయ పండితులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

అమృత మంజరి రెండో భాగం పుస్తకావిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేంద్రరావు తదితరులు


కాకినాడ రూరల్: తమిళనాడుకు చెందిన మను జ్యోతి ఆశ్రమం కాకినాడ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో అమృత మంజరి రెండో భాగం తన ప్రేమ గల చేతుల నైపుణ్యం అనే పుస్తక ఆవిష్కరణ ఆదివారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథి ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఒకే దేవుడు ఒకే దేశమనే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ, భగవంతుడు ఒక్కడనే గొప్ప చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. వేద గ్రంథాలు, పురాణంలోని సారాంశాలను చిన్న పుస్తకాలుగా ముద్రించి, ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు ఆశ్రమ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు లహరికృష్ణ, కేవీఆర్‌ఎల్ ప్రభాకర్ రావు, రిటైర్డ్ ఆర్‌ఎస్సై కేవీ రమణ, జె.రామారావు, జి.రాంబాబు, మూర్తి, నారాయణ పాల్గొన్నారు.

సేవల కోసమే ‘లయన్స్’ ఆవిర్భావం

- క్లబ్ ఉప గవర్నర్ శ్రీనివాసరావు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చిటినీడి, డాక్టర్ అమలకంటి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సామర్లకోట: పేద ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతోనే లయన్స్ క్లబ్ ఆవిర్భావం జరిగిందని క్లబ్ ఉప గవర్నర్ చిటినీడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత ఎముకలకు సంబంధించిన వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. కైరా ఎమర్జెన్సీ అండ్ ట్రామా సెంటర్‌కు చెందిన వైద్యులు టి.వెంకటభార్గవ్, కర్రి నిరూప, సీహెచ్ అజయ్‌రాకేష్, నంబారు స్నేహ, ఆశా రమ్య శ్రీపాటి వైద్య పరీక్షలు చేశారు. పేద ప్రజలకు సేవలందించడంతో క్లబ్ సామర్లకోట శాఖ ముందజలో ఉందని ఉప గవర్నర్ అన్నారు. ప్రతి ఆదివారం కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఎముకలకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, మహిళలకు సంబంధించిన పరీక్షలు, సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సుమారు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. వైద్య సేవలందించిన డాక్టర్లను క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, రీజినల్ చైర్మన్ గంగాధరరావు, క్లబ్ కోశాధికారి ఏలేటి రమేష్, మాజీ అధ్యక్షులు కర్రి ఆదినారాయణరెడ్డి, శివనాగకృష్ణ, విజయకృష్ణ, విజయభాస్కరరెడ్డి, గండు శంకరరావు, బుర్రే కృష్ణమోహన్ తదతరులు పాల్గొన్నారు.